# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 05-11-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- జిల్లాల పునర్ వ్యవస్థీకరణ అంశంపై చర్చించేందుకు మంత్రివర్గ ఉపసంఘం ఈ రోజు సమావేశమయ్యింది.
- శ్రీకాకుళం జిల్లా సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు.
- విశాఖపట్టణంలో నిర్వహించే సీఐఐ భాగస్వామ్య సదస్సు రాష్ట్ర భవిష్యత్‌కు దిక్సూచి లాంటిదని మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి పేర్కొన్నారు.
- ప్రతి ఒక్కరూ 'పీఎం సూర్యఘర్' పథకాన్ని వినియోగించుకోవాలని విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ కోరారు.

=======================

జిల్లాల పునర్ వ్యవస్థీకరణ అంశంపై చర్చించేందుకు రాష్ట్ర రెవిన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆధ్వర్యంలో మంత్రివర్గ ఉప సంఘం అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఈ రోజు సమావేశమైంది. ఈ సమావేశానికి మంత్రులు నాదెండ్ల మనోహర్, నిమ్మల రామానాయుడు, బీసీ జనార్ధన్ రెడ్డి, వంగలపూడి అనిత హాజరయ్యారు. దృశ్య మాధ్యమం విధానం ద్వారా మంత్రులు నారాయణ, సత్య కుమార్ యాదవ్ లు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అనగాని సత్యప్రసాద్ పాత్రికేయులతో మాట్లాడుతూ...

(వాయిస్ 20 సెకన్లు)

=======================

విశాఖపట్టణం వేదికగా ఈ నెల 14, 15వ తేదీల్లో జరగనున్న సీఐఐ భాగస్వామ్య సదస్సుకు సుమారు 40కి పైగా దేశాల నుంచి వివిధ కంపెనీల ప్రతినిధులు హాజరవుతున్నారని జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి తెలిపారు. విశాఖలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో సదస్సు కోసం జరుగుతున్న ఏర్పాట్లను స్థానిక ప్రజా ప్రతినిధులు, జిల్లా కలెక్టర్, ఇతర అధికారులతో కలిసి మంత్రి ఈ రోజు పరిశీలించారు. ఈ

సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ... ఈ సదస్సు ద్వారా రాష్ట్రానికి 9.8 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వస్తున్నాయని పేర్కొన్నారు. అదే విధంగా 7.5 లక్షల మంది యువతకు ఉద్యోగ అవకాశాలు వస్తాయన్న ఆశాభావం వ్యక్తం చేశారు. దేశ, విదేశాల నుంచి వచ్చే పారిశ్రామిక వేత్తలు, రాజకీయ, అధికార ప్రముఖుల సమక్షంలో 410 ఒప్పందాలు జరుగుతాయని, అలాగే, 2.7 లక్షల కోట్ల రూపాయలతో చేపట్టనున్న ప్రాజెక్టులు, శంకుస్థాపనలు కూడా జరుగుతాయని మంత్రి వివరించారు.

========================

ప్రతి ఒక్కరూ పీఎం సూర్యఘర్ పథకాన్ని వినియోగించుకోవాలని రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ కోరారు. అనకాపల్లి జిల్లా పర్యటనలో భాగంగా మాడుగుల నియోజకవర్గం కె. కోటపాడు మండలం చౌడువాడ, మాడుగుల మండలం కింతలిలో నిర్మించిన విద్యుత్ ఉప కేంద్రాలను, పలు అభివృద్ధి పథకాలను పార్లమెంట్ సభ్యులు సీఎం రమేష్, జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, శాసనసభ్యులు బండారు సత్యనారాయణ మూర్తిలతో కలిసి మంత్రి ఈ రోజు ప్రారంభించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ... జిల్లాలో 20 వేల మంది ఎస్సీ, ఎస్టీ వర్గానికి చెందిన ఇళ్లకు సోలార్ విద్యుత్ ని అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఏపీఈపీడీసీఎల్ పరిధిలో గల 11 జిల్లాలలో 250 కోట్ల రూపాయల వ్యయంతో 69 సబ్ స్టేషన్లు నిర్మిస్తున్నామని తెలిపారు. జిల్లాకు 10 సబ్ స్టేషన్లు మంజూరు చేయగా, అందులో రెండు సబ్ స్టేషన్లు మాడుగుల నియోజవర్గానికి కేటాయించామని మంత్రి పేర్కొన్నారు.

========================

ఖరీఫ్ సీజన్ లో 51 లక్షల మెట్రిక్ టన్నుల మేర ధాన్యం కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. అమరావతిలో మంత్రి పాత్రికేయులతో ఈ రోజు మాట్లాడుతూ.. 12 వేల 200 కోట్ల రూపాయల విలువైన ధాన్యం కొనుగోలు చేస్తామని చెప్పారు. రైతులను ఆదుకోవాలన్నది ప్రభుత్వ విధానమని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 24 సెకన్లు)

========================

శ్రీకాకుళం జిల్లా సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శ్రీకాకుళంలో ఈ రోజు జరిగిన జిల్లా సమీక్షా మండలి సమావేశంలో కేంద్రమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... అన్ని వర్గాల భాగస్వామ్యంతో జిల్లాలో వేగవంతమైన పురోగతిని సాధిస్తామని చెప్పారు. స్వర్ణాంధ్ర 2047లో జిల్లాను కీలక స్థానంలో నిలబెడతామని అన్నారు. ఇదిలా ఉండగా, కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను ఆయన సమీక్షించారు.

విరామం

========================

బీసీలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ఆదరణ 3.0 ద్వారా ఆధునిక పనిముట్లు అందిస్తామని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖా మంత్రి ఎస్. సవిత తెలిపారు. రాష్ట్ర వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక సంస్థ ఆధ్వర్యంలో విజయవాడలోని బీసీ సంక్షేమ భవన్ లో మూడు రోజుల పాటు నిర్వహించిన వర్క్ షాప్ ముగింపు కార్యక్రమానికి మంత్రి ఈ రోజు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కుల, చేతివృత్తులు చేసే వారికి ఆధునిక పరికరాలతో శాశ్వత ఉపాధి కల్పన కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. అదే విధంగా నిరుద్యోగ యువతకు వివిధ పోటీ పరీక్షలకు సంబంధించి ఉచితంగా కోచింగ్ సదుపాయం కల్పిస్తున్నామన్నారు.

========================

కృష్ణా జిల్లా అవనిగడ్డ నియోజకవర్గంలో ఏటిమొగ, ఎదురుమొండి హై లెవల్ వంతెన నిర్మాణాన్ని చేపడతామని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ తెలిపారు. ఈ వంతెన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో పాటు సాస్కి పథకం నుంచి నిధులు సమకూరుస్తామన్నారు. మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో కృష్ణా జిల్లా, అవనిగడ్డ నియోజకవర్గం పరిధిలోని తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో పంట నష్టం అంచనాలు, నియోజకవర్గ అభివృద్ధి తదితర అంశాలపై సమీక్షా సమావేశాన్ని ఆయన ఈ రోజు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ సహకారంతో అవనిగడ్డ ప్రాంతంలో ఉన్న అవుట్ ఫాల్ స్లూయిజ్ ల సమస్యకు పరిష్కారం చూపుతామని చెప్పారు. అటవీ శాఖ అనుమతుల కోసం నిలిచిపోయిన అభివృద్ధి పనులను ముందుకు తీసుకువెళ్లే అంశంపైనా ఈ సమావేశంలో సంబంధిత శాఖ అధికారులకు ఉప ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు.

========================

కార్తీక పౌర్ణమి సందర్భంగా రాష్ట్రంలోని శైవ క్షేత్రాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. విజయవాడ ఇంద్రకీలాద్రిపై ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానంలో పౌర్ణమి గిరి ప్రదక్షిణ ఈ రోజు ఘనంగా జరిగింది. వేకువజామునే వేలాది మంది భక్తులు గిరి ప్రదక్షిణలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా తూర్పుగోదావరి జిల్లాలో రాజమహేంద్రవరంలోని గోదావరి పుష్కర్ ఘాట్ లో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. పశ్చిమ గోదావరి జిల్లాలోని ప్రముఖ పంచారామ క్షేత్రమైన పాలకొల్లు క్షీర రామలింగేశ్వర స్వామి, భీమవరంలోని శ్రీ ఉమా సోమేశ్వర జనార్ధన స్వామి ఆలయాలతో పాటు యనమదుర్రు, ఆచంటలోని శైవాలయాల్లో ఉదయం నుంచే భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

========================

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో జల సంరక్షణకు తీసుకుంటున్న చర్యలపై జిల్లా అధికార యంత్రాంగాన్ని కేంద్ర జల శక్తి మంత్రిత్వ శాఖ ప్రశంసించింది. జల వనరుల సంరక్షణకు గానూ జల్ సించాయి... జన్ భాగీదారి అవార్డును ప్రకటించింది. గడచిన ఏడాది కాలంలో జిల్లాలో జల వనరుల సంరక్షణ.. నీటి వృథాను అరికట్టడంపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని ఈ అవార్డుకు జిల్లాను కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈ మేరకు కేంద్ర జల శక్తి మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి అర్చనా వర్మ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాకు లేఖను పంపించారు.

========================

నైరుతి బంగాళాఖాతం నుండి ఉత్తర కేరళ వరకు అంతర తమిళనాడు మీదుగా సగటు సముద్ర మట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తులో ద్రోణి కొనసాగుతోందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఆ వివరాలను వాతావరణ కేంద్రం అధికారి ఎం. వెంకటరావు తెలియచేస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

========================
========================